www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 20 ఫిబ్రవరి 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



చాటగొట్లలో వైద్య బృందం తనిఖీలు

ప్రజాశక్తి -పొదలకూరు మండలంలోని చాటగొట్ల గ్రామంలో కోళ్లు చనిపోయిన కారణంగా బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణ కోసం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టింది. కేంద్ర, వైద్య ఆరోగ్యశాఖ బృందంలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజెస్ కంట్రోల్ నుంచి డాక్టర్ సుస్మిత సింగల్, లేడీ హార్డింగ్ హాస్పటల్ నుంచి డాక్టర్ గురుమిత్ కౌర్, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ శ్రేయ శర్మ తో కూడిన బృందం చాటగొట్ల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి అక్కడ నివసిస్తున్న వ్యక్తుల నుంచి రక్త నమూనాలను సేకరించారు.కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశ్వరి, జిల్లా సర్వలెన్స్ వైద్యాధికారి భాస్కర్, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ నరసింహారావు, కిరణ్ రషీత, శ్రీ కావ్య, ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ముస్తాఫా ఉన్నారు.

వివరాలు సేకరిస్తున్న వైద్యులు

పోర్టు టెర్మినల్ కార్యకలాపాలు కొనసాగించాలి

కలెక్టర్‌కు కార్మిక సంఘాలు వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు :ముత్తుకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్ కార్యకలా పాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం నగరంలోని సతంత్ర పార్కు సమీపం నుంచి కలెక్టర్ కలెక్టరేట్ వరకూ సిఐటియు, ఎఐటియుసి, ఎఎన్‌టియుసి, ఐఎఫ్ టియు, టిఎన్‌టియుసి, ఎఐఎఫ్‌టియు (న్యూ) తదితర సంఘాలు, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం సమస్యను కలెక్టర్‌కు కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లా డుతూ అదాని పోర్టు యాజమాన్యం తన ప్రయోజ నాల కోసం ఓ ప్రణాళిక ప్రకారం కంటైనర్ కార్యకలాపాలను తమిళ నాడు ప్రాంతానికి తరలించే ఆలోచన ప్రభుత్వం విరమిం చుకో వాలన్నారు. కంటైనర్ తరలించడం వల్ల రాష్ట్ర ఆదాయం కోల్పో తుందన్నారు. సుమారుగా 10 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గండి పడుతుందన్నారు. జిల్లాలో కంటైనర్ ఆధారిత పరిశ్రమలు, గోధాములు, కోల్డు స్టోరేజీలు, ట్రాన్స్ పోర్టు వ్యాపారాలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చూపుతుందన్నారు. పోర్టు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, ఆక్వా ఎగుమ తులు, పరిశ్రమల విడిపరికరాల ఎగు మతులు, దిగుమతుల అవకాశాలు దెబ్బతింటా యని ఆవేదన వ్యక్తం చేశారు. కెపిసిఎల్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం 30 ఏళ్ల అగ్రిమెంట్ ప్రకారం మొదటి 30 సంవత్సరాలు ఓడరేవు స్థూల ఆదాయంలో రాష్ట్ర ప్రభు త్వానికి 2.6 శాతం చెల్లించాలని,, 30వ సంవత్సరం నుంచి ఆ వాట 5.4 శాతం, 40వ సంవత్సరం నుంచి 10.8 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ఒప్పందాన్ని అనుసరించి 2020-2021 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-2024 ఆర్థికస ంవత్సరం వరకు రూ.46 కోట్లు, 54 కోట్లు, 72 కోట్లు, 89 కోట్లు ప్రభుత్వానికి పోర్టు యాజమాన్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా పోర్టును స్వాధీనం చేసుకున్న ఆదాని సంస్థలు తమ సొంత పోర్టులను అభివృద్ధి చేసుకొనేందుకు ఈ పోర్టును పావుగా వాడుకుంటున్నారన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జిల్లాలోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లోని సీమెన్స్ గమేషా కంపెనీ ఒక యూనిట్ మూతపడిందన్నారు. ఈ కంపెనీ మూతపడటం వల్ల 600 మంది కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. జిఆర్‌ఐ టవర్స్ మూసివేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కంపెనీ మూతపడితే మరో 300 మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. కంటైనర్‌ను ఆధారంగా చేసుకొని సాగుతున్న వ్యాపార కార్యకలాపాలు న్యూస్‌ప్రింట్, ఫుడ్ ఐటమ్స్, కస్టమ్స్‌ఏజెంట్ కంపెనీలు, లేజర్, లైనర్ ఏజెంట్లు, ఫుమినేషన్ సర్వీసెస్ కార్యాలయాలు, హమాలీలు, డ్రైవర్స్, ట్రాన్స్‌పోర్టు, హౌస్ కీపింగ్, కూలీల కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటా యన్నారు. ఈ నేపథ్యంలో కంటైనర్ టెర్మినల్‌ని కృష్ణపట్నం నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించాలన్న పోర్టు యాజమాన్య నిర్ణయాన్ని ప్రభుత్వం నిలువరించాలన్నారు. టెర్మినల్ యధావిధిగా పోర్టులో కొనసాగించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : ఎస్‌పి

వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి తిరుమలేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభించాలన్న సంకల్పంతో 'స్పందన' కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో ఆయన పాల్గొని 80 మంది బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నమోదు అవుతున్న హత్యకు సంబంధించిన కేసులలో అలసత్వం లేకుండా అన్ని కోణాలలో దర్యాప్తు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.అనుమానాస్పద, మిస్సింగ్ కేసులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సాంకేతికత ఆధారంగా త్వరితగతిన ఛేదించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడిషినల్ ఎస్‌పి (అడ్మిన్), ఆత్మకూరు, డిటిసి, డిఎస్‌పి, ఎస్‌బి సిఐ, కంప్లైయింట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక వేదాయపాళెంలోని సుస్మిత నర్సింగ్ కళాశాల క్రీడా మైదానంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పిహెచ్.పి అసోసియేషన్ సహ కారంతో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్-2024, ఓటుపై అవగాహన సదస్సు, ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహించారు. సోమవారం నర్సింగ్ విద్యార్థులకు ఓటరుపై అవగాహన సదస్సు నిర్వహించి అనంతరం ర్యాలీ చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం భోజన విరామం అనంతరం పిల్లలకు టగ్ ఆఫ్ వార్, హ్యాండ్ బాల్, కోకో ఆటల పోటీలు నిర్వహించి వారికి మెమెంటోలు ప్రశంసా పత్రాలు అందజేశారు. యూత్ ఆఫీసర్ ఏ. మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఓటరు ఓటు హక్కుపై అవగాహన కలిగి, ఓటు వేసినప్పుడే సరి అయిన నాయకుడిని ఎన్నుకోవడం సాధ్యపడుతుం దన్నారు. పిహెచ్‌పి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పి. హెచ్.పి జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు ఉన్నారు.

కొనసాగుతున్న కూలీల సమ్మె

ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : ఆచార్య ఎన్. జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రోజువారి కూలీలుగా పనిచేస్తున్న కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెబాట పట్టారు. నగరంలో ఆకుతోట ప్రాంతంలో ఉన్న ఆచార్య యన్ .జి రంగ రీసెర్చ్ వ్యవసాయ క్షేత్రం నందు కార్మికులు చేస్తున్న సమ్మె సోమ వారం నాటికి 4వ రోజుకు చేరింది. యూనియన్ నాయకులు నాగభూషణం, సిఐటియు రూరల్ ప్రధాన కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడుతూ. నేరుగా ప్రభుత్వ భూమిలో వ్యవసాయ భూమిలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని, ప్రమాద బీమాను ఆ కార్మికులకు వర్తింపజేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వ్యవసాయ క్షేత్ర రీసెర్చ్ సెంటర్ కార్మికులుగా వారికి గుర్తింపు కార్డులు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. సిఐటియు నాయకులు ప్రసాద్ కార్మికులు శ్రీదేవి, శ్రీను, రమ్య, సుబ్బులమ్మ కార్మికులు పాల్గొన్నారు.

కందుకూరులో పొగాకు బోర్డు చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి -కందుకూరు : గుంటూరు నుంచి పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ సోమవారం కందుకూరు 26 వ వేలం కేంద్రం 27 వ వేలం కేంద్రాన్ని సందర్శించారు. పొగాకు రైతులతో సమావేవ మయ్యారు.. రైతులు పండించిన పొగాకును బోర్డు లోనే అమ్ముకోవాలని తెలి పారు. యశ్వంత్ పొన్నలూరు దూబ గుంట గ్రామాలు 27 వ వేలం కేంద్రం లోని శాఖవరం, విఅర్ కోట గ్రామాలలో పొగాకు క్యురింగ్ లు, గ్రేడింగ్ లు పరిశీలించారు. వారు రైతులకు పలు సూచనలు చేశారు. వేలం నిర్వహణాదికారులు చైన్ రామ్ మీనా, రాజగోపాల్ , పొగాకు బోర్డు సిబ్బంది 26, 27 వ వేలం కేంద్రం పొగాకు రైతులు పాల్గొన్నారు.

పరీక్షలకు హాజరయ్యే

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

నెల్లూరు :డిగ్రీ సెమిష్టర పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుని తగిన మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి డి చరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఇక్కడ మాట్లాడారు. అధికార వైసిపి ప్రజలను, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ అనం తపురంలో జరిగిన సిద్ధం సభకు బస్సులను తరలించడం సిగ్గుచేటన్నారు. నేటి నుంచి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఆర్‌టిసి బస్సులు లేక ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందనాన్రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షులు పి.మనోజ్, పవన్, విష్ణు ఉన్నారు.

రోబోటిక్ కార్ పార్కింగ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

'కిమ్స్'లో రోబోటిక్ కారు పార్కింగ్

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని కిమ్స్ వైద్యశాలలో దక్షిణ భారత దేశంలోనే ప్రప్రథమంగా అధునాతమైన రోబోటిక్ కార్ పార్కింగ్ యూనిట్‌ను ప్రారంభించామని ఆ వైద్యశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. గిరినాయుడు పేర్కొ న్నారు. సోమవారం వైద్యశాలలో రోబోటిక్ కార్ పార్కింగ్ యూనిట్ ప్రారం భోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ , అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టరు బొల్లినేని భాస్కర్‌రావు, బొల్లినేని కృష్ణయ్య, బొల్లినేని శ్రీనయ్యలు పాల్గొని ప్రారంభించారు. వారు మీడియాతో మాట్లాడుతూ వైద్యచికిత్సల నిమిత్తం తమ ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకుల సౌకర్యార్థం ఈ యూనిట్‌ను ప్రారంభించామన్నారు. వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఈ రోబోటిక్ కార్ పార్కింగ్ యూనిట్‌లో 91 కార్లు పార్కింగ్ చేసుకోవచ్చున్నారు.ఈ సౌకర్యాన్ని చికిత్సల నిమిత్తం తమ వైద్యశాలకు వచ్చే రోగులు వినియోగిం చుకోవచ్చున్నారు.

కావ్య కృష్ణారెడ్డి పరిచయ సభలో ' ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు : కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కావ్య కష్ణారెడ్డి పరిచయ కార్యక్రమం నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం సోమవారం కావలిలోని బృందావనం హౌసింగ్ కాలనీలోని కళ్యాణ మండపంలో జరిగింది. మాలెపాటి సుబ్బానాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రివర్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, మాజీ మంత్రివర్యులు పొంగూరు నారాయణ, ఎంఎల్‌సి బి.రాంగోపాల్ రెడ్డి, ఉదయగిరి టిడిపి ఇంచార్జి బొల్లినేని రామారావు, ఇతర నాయకులతో కలిసి కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

'ఇంటూరి' ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు :టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణంలోని 27, 28వ వార్డుల పరిధిలోని కోటు బజారు, రజక పాలెం ప్రాంతాల్లో నిర్వహించారు. నాగేశ్వర రావు, ఇతర నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శీను, వార్డు అధ్యక్షులు పాలంకి ప్రసాదు, పాకల మాల్యాద్రి, సవిడి బోయిన వెంకటకష్ణ, మేడా నరసింగరావు, దారం విజయ్, అమ్మనబోయిన వేణు, బక్కమంతల మదన్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు :జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిషోర్ రాసిన 'పాలపిట్ట' ధీర్ఘ కావ్యంకందుకూరు నియోజకవర్గం సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, సాహిత్య, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబిస్తుందని ప్రముఖ సాహిత్యాభిలాషి దామా వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కోటారెడ్డి భవనం (సిపిఐ ఆఫీస్) వద్ద పాలపిట్ట పోస్టర్ ఆవిష్కరణ చేసిన సందర్భంగా దామా వెంకటేశ్వర్లు మాట్లాడారు. గాంఢ్లహరిప్రసాద్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ కార్యదర్శి చనమాల కోటేశ్వరరావు మాట్లాడారు. సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిషోర్ చే విరచించిన పాలపిట్ట దీర్ఘ కావ్యం శాసనసభ్యులు మానుగుంట మహిధరరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 24న జరుగుతుందని తెలిపారు.సిపిఐ కార్యదర్శి బూసి.సురేష్, రిటైర్డ్ ఎ.ఈ సింగయ్య, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్చార్జి బెజవాడ కొండయ్య, సీనియర్ జర్నలిస్టు ఉప్పుటూరి మాధవరావు తదితరులు ఉన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు గ్రామదేవత అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రూ. 6 కోట్లతో మొదటి దశ నిర్మాణం పూర్తయింది. మరో రూ. 4 కోట్లతో నిర్మించే అనివేటి మండపం నిర్మాణానికి ఆదివారం నెల్లూరు వాస్తవ్యులు మంచిరాజు వెంకట శివకుమార్ ధర్మపత్ని సుగుణ కుమారుడు ప్రశాంత్ రూ10,000లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మంచిరాజు మురళిమోహన్ కు అందజేశారు. మురళి మోహన్ మాట్లాడుతూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-నెల్లూరు :అర్హత కలిగిన, అక్రిడిటేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం నివేశన స్థలం కేటాయించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతూ 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు నెల్లూరు జిల్లా జర్నలిస్టు భవన్ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న తరుణంలో జర్నలిస్టులకు నివాశ స్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. జర్నలిస్టు భవన్ కమిటీ సభ్యులు మల్లికార్జున, భరత్, ప్రవీణ్, నరసింహులు, ఎ.వెంకటేశ్వర్లు, రోహిత్ ఉన్నారు.

విద్యావంతురాలు 'అరవింద యాదవ్'

కఠారి అరవింద యాదవ్, వైసిపి కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా నియమితులైన కఠారి అరవింద్ యాదవ్ విద్యాధికురాలు.ఆమె నాలుగు డిగ్రీలు సాధించారు. ఇంజినీరింగ్‌లో డిగ్రీ చదివిన అరవింద ఆ తర్వాత ఎంబిఎ చదివారు. రాయలసీమ విశ్వ విద్యాలయం నుంచి న్యాయవాద విద్యలో డిగ్రీ సాధించిన అరవింద ఆపై ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయవాద విద్యలో మాస్టర్ డిగ్రీ చేశారు. ఆమె భర్త వెంకటరామ్ న్యాయవాదే. ఆది శంకర ఎడ్యుకేషనల్ సొసైటీ నడుపుతున్న ఆరు కళాశాలలు, కొన్ని పాఠశాలలకు అరవింద పర్యవేక్షకురాలు. కినాకిల్ స్టాఫ్ టెక్ కంపెనీ తో పాటు ఓ ఇన్‌ఫ్రాస్టచరల్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్. ఐశ్వర్య ప్రాపర్టీస్ కంపెనీలో భాగస్వామి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో వివిధ వ్యాపారాలు సాగిస్తున్న అరవింద 1987లో జన్మించారు.ఆమె బహుభాషా కొవిందురాలు. తెలుగు ,ఇంగ్లీష్ తో పాటు తమిళం, కన్నడం, హిందీ భాషలు అరవిందకు వచ్చు. అరవింద భర్త వెంకటరామ్ కుటుంబ మూలాలు పామూరు సమీపంలో ఉన్నాయి. చెన్నయ్ కేంద్రంగా వ్యాపారాల సాగిస్తున్న అరవింద కుటుంబం జయ పయాయాలతో సంబంధం లేకుండా కందుకూరులో ఇల్లు నిర్మించుకోవాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

'నారాయణ' నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం

శ్రీనారాయణ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఐ.వి మమత మాట్లాడారు.

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక చింతారెడ్డిపాళెంలో నారాయణ వైద్య విద్యాసంస్థల ప్రాంగణంలోని ఆడిటోరియంలో నారాయణ నర్సింగ్ కళాశాల 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాటి మనిషి పట్ల ప్రేమ, దయ, సహనంతో ఒక ఔషదంలా నర్సులు విధులు నిర్వర్తిస్తారనటంలో ఎలాంటి సందేహం లేదన్నారు. నర్సింగ్ విద్య పూర్తి చేసిన వారికి ఎన్నో రంగాలలో అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు బి. వనజ కుమారి మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే చక్కటి వాతావరణం అవసరమని, అందుకు తగ్గట్టే నారాయణ నర్సింగ్ కళాశాలలోని వసతులు, సదుపాయాలు ఉన్నాయని, అలాగే నిష్ణాతులైన అధ్యాపకులు ఇతర బందం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి నిరంతరం శ్రమిస్తారన్నారు. అనంతరం బహుమతులు అందజేశారు. నారాయణ వైద్య విద్యాసంస్థల ఆపరేషన్స్ హెడ్ రామారావు, ఏ.జి. ఎం శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఓటు భవిష్యత్తును నిర్ణయిస్తుంది..

మాట్లాడుతున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి -పొదలకూరు :పట్టణంలోని బోగాలు కృష్ణారెడ్డి కళ్యాణ మండపంలో సోమవారం మండల టిడిపి నాయకులు, టిఎన్ఎస్ఎఫ్ , తెలుగు యువత ఆధ్వర్యంలో " మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి "మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్" కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాలల డిగ్రీ విద్యార్థులతో, మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్న యువతకు ఓటు పట్ల అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలు ఎపి ప్రజలకు చాలా ముఖ్యమైనవని తెలిపారు. రాష్ట్రంలో ఒక సైకోతో పోరాడుతున్నామని, రాష్ట్ర భవిష్యత్తు కోసం అందరూ ఈ యాభై రోజులు బాధ్యతా యుతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యో గులను జగన్ మోసగించారన్నారు. ఎపిలోని పరిశ్రమలను, కియా మోటర్స్, అమరరాజా వంటి కంపెనీలను పక్క రాష్ట్రాలకు తరిమేశారన్నారు. రాజధాని లేకుండా చేసి యువత భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న జగన్‌ను తరమేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు,బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు,దేవినేని శరత్ చిరంజీవి,డేగా యశ్వంత్ రెడ్డి, బోగోలు భాస్కర్ రెడ్డి, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, బక్కయ్య నాయుడు, పులిపాటి వెంకట రత్నం నాయుడు, జమీర్, కసిరెడ్డి సుజిత్, టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు కలగట్ల సందీప్,కరియావుల శ్రీనివాసులు,అజయ్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ జడపల్లి సూర్య, తెలుగు యువత నాయకులు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి ,నియోజకవర్గ యువత అధ్యక్షులు రాజా గౌడ్,కిరణ్ గౌడ్, అబ్దుల్లా,వెంకటాద్రి, గుదె రామకష్ణ,సాధం గిరి, శంకర్ రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధం..

వైసిపి నేతలకు 'ఇంటూరి' సవాల్

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చించటానికి తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు మీరు సిద్ధమా అని వైసిపి నేతలకు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు సవాల్ విసిరారు. సోమవారం కందుకూరులోని టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిపై చర్చకి రావాలంటూ తమ నాయకుడు నారా చంద్ర బాబు నాయుడు ఇటీవల విసిరిన సవాల్‌కు వైసిపి నేతలు ఇంతవరకు స్పందించలేదని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేసిన 120 కి పైగా సంక్షేమ పథకాలను జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే రద్దు చేశారని గుర్తు చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, పట్టణ ఉపాధ్యక్షుడు వడ్డెళ్ళ రవిచంద్ర, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర ఉన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

జర్నలిస్టుపై దాడి అమానుషం

గాంధీ బొమ్మ సెంటర్‌లో ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి నెల్లూరు : వైసిపి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులపై దాడులు పెరిగి పోయాయని ఎపియుడబ్ల్యుజె, ఎపిపిజెఎ నాయకులు పేర్కొన్నారు. రాప్తాడులో ఆంధ్ర జ్యోతి ఫొటో గ్రాఫర్ కష్ణపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో జర్నలిస్టు యూనియన్ ఎపియుడబ్ల్యుజె, ఎపిపిజెఎ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేసే జర్నలిస్టులపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం స్పందించి జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఎ జయప్రకాష్. జిల్లా అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు దయాశంకర్ కోశాధికారి హనోక్. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు రమేష్, ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ నేతలు జాకీర్ ముజీద్ వెంకట్రావు, జర్నలిస్టుల నేతలు రాజేష్. నాగరాజు మహేష్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కమిటీ ఖండన

నెల్లూరు :వైసిపి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులపై దాడులు అధికమైపోయాయని, ఇవి అమానుషమని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ కృష్ణ పై జరిగిన దాడి అమానుషమన్నారు. ఇలాంటి సంఘటన మరలా పునరావృతం కాకూడదని తెలిపారు. దాడిచేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఖండన

సిఎం సమక్షంలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై విచక్షణ రహితంగా దాడిచేయడం పత్రికా స్వచ్ఛపై దాడేనని ఎపిడబ్ల్యుజెఎఫ్ , ఎపిబిజె తీవ్రంగా ఖండించింది. ఆ సంఘం నాయకులు కె. సుధాకర్, పి. బాలకృష్ణ, మునింద్ర, శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వ తీరును ఖండించారు. ఈ ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దాడిచేసిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దాడి హేయం : డివైఎఫ్‌ఐ

ఓ దినపత్రికలో పనిచేస్తున్న విలేకరిపై దాడి చేసినవారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్‌ఐ నగర కార్యదర్శి నరసింహ ప్రకటన లో ఖండించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రజ్యోతి పత్రిక ఫోటోగ్రాఫర్ శ్రీకష్ణపై ఆదివారం అనంతపురంలో వైసిపి నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి,ప్రజలకు వారధిగా మీడియా కీలక పాత్ర వహిస్తుంన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం మీడియా అని, అటువంటి మీడియాకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

దాడి సిగ్గుచేటు : టిడిపి

కందుకూరు :అనంతపురం జిల్లా రాప్తాడులో సిఎం ఆధ్వర్యంలో జరిగిన "సిద్ధం" బహిరంగ సభలో వీడియో కవర్ చేస్తున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్, టీవీ 5 రిపోర్టర్‌పై రౌడీమూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేవారు.

వ్యక్తి దారుణ హత్య

హత్యకు గురైన పెంచల ప్రసాద్

పెంచల ప్రసాద్ (ఫైల్)

ప్రజాశక్తి-నెల్లూరు :వివాహితుడు దారున హత్యకు గురైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాడిపూరి పెంచల ప్రసాద్(35) స్థానిక రామచంద్రాపురం ప్రాంతంలో నివాసముంటాడు. అతనికి 2019లో వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం రాత్రి మృతుడు తన పిల్లలు, భార్యతో కలిసి స్వగృహంలో నివసిస్తున్న సమయంలో ఇంటి తలుపు కొట్టడంతో చప్పుడు వచ్చింది. దీంతో లేచి తలుపు తీశాడు. వెంటనే ఐదుగురు యువకులు మారణా యుధాలతో ఇంట్లోకి ప్రవేశించారు. దుండగులు మృతుడి భార్య నోట్లో గుడ్డలు కుక్కి అరిస్తే అందరినీ చంపేస్తామని భయపెట్టారు. ఒక్క సారిగా ఇంట్లోకి వచ్చిన వారిని ప్రతిఘ టించేందుకు ప్రయత్నించిన పెంచలప్రసాద్‌పై నలు గురు వ్యక్తులు తమ వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణా రాహిత్యంగా దాడికి పాల్పడ్డారన్నారు. కాళ్లు, చేతులు, మెడ, ఛాతీ తదితర ప్రాంతాల్లో సుమారుగా 25 చోట్ల అత్యంత కిరాతకంగా పొడవంతో పెంచలప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌పి కె.తిరుమలేశ్వరరెడ్డి సూచనల మేరకు నవాబుపేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులను గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బంది రంగంలోకి దిగాయి. ఆధారాలు సేకరించారు. ఈ హత్య పాత కక్షల నేప థ్యంలో జరిగిందా.. లేక మరేదైనా కారణాలు న్నాయా అన్న కోణాలల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నూతక్కి వారి కండ్రిగలో వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : చేజర్ల మండలంలోని నూతక్కి వారి కండ్రిగ గ్రామంలో ప్రజలు జ్వరాలతో వణికి పోతున్నారు. 15 రోజులుగా ఆ గ్రామంలో ప్రజలు జ్వరాలతో విలవిల్లాడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. జ్వరాలకు తోడు ఒళ్లు నొప్పులతో అల్లాడిపోతున్నామని వాపోతున్నారు. నొప్పులకు జ్వరాలకు మందులు వాడిన తగ్గడం లేదని చెబుతున్నారు. ఒకే కుటుంబంలో రెండు మూడుసార్లు జ్వరం వచ్చిందని ఒళ్లంతా గాదడం ముక్కు వద్ద మచ్చలుగా ఏర్పడుతున్నాయన్నారు. ప్రతి కీళ్ళ వాపిపోయి, జాయింట్లు ఊడిపోయినట్లు పెయిన్ వస్తుందని స్థానికులు చెబుతున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా ఈ ఒళ్లు నొప్పులు దురద సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయని ఆదివరకు వృద్ధులు చెప్తున్నారు. గ్రామస్తులు స్థానికంగా ఉన్న వైద్యుల వద్ద వైద్యం చేసుకుంటూ మందులు వాడుతున్నారు. రోజురోజుకు విజృంభిస్తున్న జ్వరాలపై స్పందించాలని కోరుతున్నారు. మందులు వాడిన తగ్గినట్లే తగ్గి మళ్లీ జ్వరం వస్తుందని తెలిపారు. వైద్యాధికారులు గ్రామాన్ని ఎవరు సందర్శించలేదని తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని గ్రామస్తులు సందర్భంగా తెలియజేశారు. వేడి నీళ్లతో కాపు కాసుకుని టాబ్లెట్ వేసుకుంటే కొంచెం ఉపశమనం కలుగుతుందని, తర్వాత యధాస్థితిగా ఒళ్లు నొప్పులు కాళ్లు వాపులు, దురద ఉంటాయని తెలిపారు. ఆదివారం యూట్యూబ్ ఛానల్, ప్రజాశక్తి పత్రిక మాధ్యమాలలో కథనాలు రావడంతో చేజర్ల మండలం, చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో నూతక్కి వారి కండ్రిగ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పారిశుధ్యం లేని కారణంగానే ఈ విష జ్వరాలు ప్రబలి ఉండవచ్చునని డాక్టర్ తెలియజేశారు. దోమల వల్ల ఈ విష జ్వరాలు ప్రబలి ఉంటాయని డాక్టర్ నవీన్ రెడ్డి తెలియజేశారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని గ్రామస్తులకు తెలియజేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో చిత్తలూరు పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

26న మంద కృష్ణమాదిగ రాక

ప్రజాశక్తి-కావలి : మహాజననేత మందకృష్ణ మాదిగ 26వ తేదీ కావలికి రానున్నట్లు నాయకులు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం కావలి ఉదయగిరిరోడ్డులోని సన్ స్కూల్ ప్రాంగణంలో ఎం.ఎస్.పి. జిల్లా అధికార ప్రతినిధి చేవూరు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఆర్‌పిఎస్ కావలి నియోజకవర్గ అధ్యక్షులు ఐమూరి మహేష్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం రాష్ట్ర పర్యటనలో భాగంగా 26వ తేదీన జిల్లా సమీక్ష సమావేశంలో భాగంగా మందకృష్ణమాదిగ కావలికి విచ్చేయనున్న సందర్భంగా జిల్లాస్థాయి ముఖ్య నాయకులు అందరూ ఈ సమావేశంలో పాల్గొని వారి సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపోగు ఉదయ్ కృష్ణమాదిగ పాల్గొని 26న కావలిలో జరుగబోయే జిల్లా విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా నలుమూలల నుంచి ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఇఎఫ్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. మరియమ్మ వర్గీకరణ విషయమై ఢిల్లీ స్థాయిలో జరుగుతున్న పరిణామాలు గురించి వివరిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు పాపయ్య మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు కొప్పర్తి కొండయ్య మాదిగ, ఎంఇఎఫ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లపోలు సుకుమార్ మాదిగ, ఎంఇఎఫ్ నాయకులు చంద్రశేఖర్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న రాములు మాదిగ, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా మహిళా అధ్యక్షురాలు గ్నా జానకి, ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి రమణయ్య మాదిగ, ఎంఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు అక్కిలిగుంట ఏసు మాదిగ, ఎంఎస్‌పి కావలి పట్టణ అధ్యక్షులు చేవూరు వరప్రసాద్ మాదిగ తదితరులున్నారు.

రచ్చబండలో మేకపాటి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలోని పలు వీధుల్లో వైసిపి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పాల్గొని గడపగడపలో విస్తృత పర్యటన చేశారు. సోమవారం ఆయన దిలావర్ బాచి, షబీర్ కాలనీ, దేవాంగ్ల, తూఫాన్ నగర్, పలు వీధుల్లో గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలంటూ ఆదేశించారు. త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి, వైసిపి జిల్లా నాయకులు దస్తగిరి అహ్మద్, మండల కోఆప్షన్ సుభాని, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బిఎంఆర్'కు ఘన సన్మానం



ప్రజాశక్తి-ఉదయగిరి : దుత్తలూరు మండలం నర్రవాడ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న యాదవ చైతన్య వేదిక నిర్మాణ శంకుస్థాపన సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావును, బోడె రామచంద్ర యాదవ్‌ను వైసిపి బిసి నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్య గణపతుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిల ఐక్యతతో రాబోవు ఎన్నికల్లో బిసిల సత్తా చాటాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని బిసి నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని శంకుస్థాపన కార్యక్రమం విజయవంతం చేశారు.

నృత్య శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : కావలి తుఫాన్ నగర్, శివాలయంవీధిలో శ్రీమహేశ్వరి నృత్య సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర కుమార్తె నాట్యమయూరి కుమారి జి.లిఖిత ఆధ్వర్యంలో పునఃప్రారంభించే నృత్య కళానిలయంలో శిక్షణ తరగతులను రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు, ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీదమస్తాన్ రావు మాట్లాడుతూ నృత్యకళానిలయం నృత్య శిక్షణ నిర్వాహకురాలు కుమారి జి.లిఖిత ఎక్కువమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి మంచి కళాకారులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఆర్ధికసాయం మంజూరు చేయించడానికి ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారు. ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కావలిలో నృత్య కళా భవనం నిర్మించడానికి నివేశ స్థలం మంజూరు చేయించడానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కరతాళ ధ్వనుల మధ్య భోరాపరిచారు. బీమంత్, ఆర్.పి.ఆర్. ప్రేమభిమానులు, సంయుక్త సేవాసంస్థ సభ్యులు డాక్టర్.సతీష్, బి.రఘుకుమార్ రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, పి.జానకిరామ్, జి.కళ్యాణ్, ఎం అజిత్ బాబు, ఎంవి ప్రసాద్ రావు, భారత్ బాషా, ఎస్.శివ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

బహుజన సమర భేరిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ఉదయగిరి : కొండాపురం మండలంలో 23న జరిగే బహుజన సమర భేరిని విజయవంతం చేయాలని దళిత గిరిజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కలివెల ఎలిషా కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో ప్రధానాంశంగా ఆయన ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌సి డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, మాజీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ఎపిఎంఆర్‌పిఎస్ నాయకులు నల్లిపోగు.ప్రసాద్, ఎస్‌సిసెల్ మండల కన్వీనర్ గడ్డం రమణయ్య, కలిగిరి, వింజమూరు నాయకులు ఎం పెద్దన్న, వై తిరుపాలు, ప్రసాద్, ఉత్తలి రమణయ్య పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-కోవూరు : రహదారి భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని దీనికి మునిసిపల్ అనేది ఉండదని రవాణాశాఖ ఉప కమిషనర్ చందర్ అన్నారు. సోమవారం కోవూరులోని లారీ యార్డ్ అసోసియేషన్లో 35వ రహదారి భద్రత ఉత్సవాల మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కావలి ఆర్‌టిఒ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల శాతాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కోవూరు ఇన్‌ఛార్జి ఆర్‌టిఒ మురళీమోహన్, అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కావలి : జమాతే ఇస్లామీ హింద్ కావలి శాఖ ఆధ్వర్యంలో కావలి ముసునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీ సాయి విద్యానికేతన్, ఐ.పి.ఎస్ స్కూల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు జరిపి ప్రథమ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ బాధ్యులు మహబూబ్ బాషా, ఎమ్.డి. రఫీ, అఖిల్, సయ్యద్ జిలాని, చాంద్‌బాషా, మహిళా నాయకులు ఫాతిమా, భుష్రా, షాహీనా, తదితరులున్నారు.

వలంటీర్లు సేవా సారథులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కరోనా లాంటి విపత్కర పరిస్థితులు, వర్షాలు, వరదలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రజలకు అందచేసిన సంక్షేమ పథకాలను నిరంతరం అందజేసిన వలంటీర్లు సేవా సారథులు అని, వారికి సలాం చేస్తున్నామని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి కొనియాడారు. సోమవారం ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని వరుసగా నాల్గవ సంవత్సరం నిర్వహించడంతో కార్యక్రమానికి ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎటువంటి అవినీతికి తావు లేకుండా అందజేయడంలో భాగస్వామ్యులైన వలంటీర్లను ఇలా సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జగనన్న ఏర్పాటు చేసిన ఇలాంటి వ్యవస్థతో ప్రజలందరికీ ప్రభుత్వ పాలన, సంక్షేమం గడప ముంగిటకే చేరిందని, గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్లు అత్యుత్తమ సేవలందిస్తుండడంతోనే తాము సైతం అభివృద్ధిని పనులను వేగవంతం చేసి ప్రజలకు అందజేయగలుగుతున్నామన్నారు. వలంటీర్లు అదేవిధంగా తమ సేవా కార్యక్రమాలను కొనసాగించాలని తెలిపారు.

వలంటీర్లను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి

రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ అందజేస్తున్న సేవలను చూసి పక్క రాష్ట్రాల్లో సైతం అమలు చేసేందుకు ఆయా ప్రభుత్వాలు సన్నద్ధమవుతున్నాయని, జగనన్న మదిలో వచ్చిన ఈ ఆలోచనతో ప్రజలందరికి సంక్షేమం అందిందని, ఇది దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. వలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమం, అభివృద్ధి పనుల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉంటారని, ప్రస్తుతం ప్రభుత్వం కల్పిస్తున్న పోటీ పరీక్షల్లో వలంటీర్లు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, వచ్చే సంవత్సరం ఇప్పుడున్న వలంటీర్లు ఉద్యోగాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

నియోజకవర్గ సంపూర్ణాభివృద్ధికి ఎంవిఆర్ ఆమోద్

ఆత్మకూరు నియోజకవర్గంలోని వలంటీర్లందరి సహకారంతో ఇప్పటికే సమస్యా నమోదు పుస్తకం ద్వారా ప్రతి ఇంట్లో సమస్యలను తెలుసుకుంటున్నట్లు, అందులో చాలా వరకు సమస్యలను పరిష్కరించినట్లు, ప్రజా సమస్యలను, అభివృద్ధిని మరింత వేగంగా చేసేందుకు ఎంవిఆర్ ఆమోద్ (ఎంవిఆర్ ఆత్మకూరు మోడల్ ఆఫ్ డెవలపింగ్ హోలిస్టికల్లి)ను ఏర్పాటు చేసినట్లు ఎంఎల్‌ఎ మేకపాటి పేర్కొన్నారు. సోమవారం జరిగిన వలంటీర్ల అభినందన సభలో ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఎంవిఆర్ ఆమోద్ విధి విధానాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వలంటీర్లకు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తెలుపుతున్న సమస్యలను ఎంవిఆర్ ఆమోద్ ద్వారా తెలియజేస్తే వెంటనే తమకు సమాచారం తెలుస్తుందని, ఆ సమాచారాన్ని సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించవచ్చని, వలంటీర్లు ఎంవిఆర్ ఆమోద్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, నియోజకవర్గంలోని ఎంపిపిలు బోయిళ్ల పద్మజారెడ్డి, కేత వేణుగోపాల్ రెడ్డి, జెడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్న లక్ష్మి, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ నారసింహారెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, షేక్.పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందించాలని వినతి

ప్రజాశక్తి-కావలి రూరల్

జలదంకి మండలం లింగరాజు అగ్రహారం గ్రామంలో 800 ఎకరాలు వరి పైరు వేసి ఉన్నారని కావలి కాలువ నుండి తక్షణం సాగునీరు అందించి వరి పైరును కాపాడాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒ కృష్ణ ప్రసాద్‌కు రైతు సంఘం, వ్యవసాయ కార్యదర్శి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగరాజు అగ్రహారం గ్రామ సర్పంచ్ ఎం.తిరుమల మాట్లాడుతూ లింగరాజు అగ్రహారంలో రైతులు సాగు చేస్తున్న పొలాలకు తక్షణం సాగునీరు ఇచ్చి నిలువుపై ఉన్న వరి పైరును కాపాడాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.మాల్యాద్రి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రావి మాల్యాద్రి, మాట్లాడుతూ ఇప్పటికైనా లింగరాజు అగ్రహారం రైతులకి సాగునీరు తక్షణమే ఇవ్వకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుర్రం సుబ్బారావు, మేక మురళి, బోయిన మాల్యాద్రి, మంగళ వీరాస్వామి, కుడారి కేశవులు, ఒంగోలు మోహన్, బోయిన మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

9గంటలు విద్యుత్ సరఫరా చేయాలి

ప్రజాశక్తి-దగదర్తి

ప్రభుత్వం ఒక పక్క రైతులకు 9 గంటలు విద్యుత్ అందిస్తుందని చెబుతున్నా విద్యుత్ శాఖ అధికారులు మాత్రం 7గంటలు మాత్రమే కరెంటు అందిస్తున్నారని, 9గంటల విద్యుత్ అందించాలని సిపిఎం, రైతుసంఘం నాయకులు దగదర్తి సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని బోర్ల కింద ఆధారపడి వరి, పత్తి, మిర్చి, వేరుశనగ సాగు చేస్తున్నారని తెలిపారు. 7గంటల కరెంటు వల్ల నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. దాంతో రైతుల కష్టపడి పండించిన ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వంటేరు సుధాకర్, గోపసాని మధు, మంద మహేష్, మురికం శీనయ్య, గోపసాని పెంచలయ్య, చల్లా మాల్యాద్రి, పెరికల మాల్యాద్రి, గురిజాల వెంకటేశ్వర్లు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డప్పు కళాకారులకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-కోవూరు : డప్పు కళాకారులకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని ఆ సంఘం నాయకులు కోరారు. స్థానిక మందబయలు సెంటర్ నుంచి డప్పు వాయిద్యాలతో ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ధర్నాను ఉద్దేశించి డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి తల్లు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆరోగ్య సమస్యలపై అక్షరాస్యత, అనేక పండగలు ఉత్సవాలలో ప్రజలకు నిత్యం అందుబాటులో డప్పులు జానపదం, కోలాటం, పండరి భజన, సాంఘిక నాటకాలతో వత్తి కళాకారులు అనేకమంది ప్రభుత్వం అందించే రూ.3వేలు పింఛను చాలక ఇబ్బందులకు గురవుతున్నారు. తెలంగాణలో కళాకారులకు రూ.5వేలు అందిస్తున్నారు. అదే విధంగా మన రాష్ట్రంలో కూడా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కళాకారులను గుర్తించి గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు, ట్రైను, బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జి.శేషయ్య, నాయకులు చిన్నమ్మ , బుజ్జయ్య, తాళ్లూరు వెంకయ్య. దొంతోలు పెద్ద చెంచయ్య.శివ, వెంకట నాగరాజు, విజయ్ కుమార్, హరి, రమేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన రహదారిలో సోమశిల రోడ్డు సెంటర్ నుండి డిపో వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో పట్టణ వాహనదారులకు పాదచారులకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని వెంటనే అక్కడ రోడ్డు వెడల్పు కార్యక్రమం ప్రారంభించాలని సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో డిటి సంధ్యకు సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులో ఉన్న భవనదారులకు నష్టపరిహారం చెల్లించే ప్రక్రియలు చేపట్టి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యను నివారించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జిల్లా కౌలు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంటా లక్ష్మీపతి, ఆత్మకూరు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, ఎపి రైతుసంఘం కార్యదర్శి లక్కు.ప్రసాద్, పార్టీ నేతలు కార్యకర్తలు హాజరయ్యారు.

వినతినిస్తున్న సిపిఎం నాయకులు

తహశీల్దార్‌ను కలిసిన కౌన్సిలర్ 'సూరా'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.శివనాగిరెడ్డిని సోమవారం కౌన్సిలర్ (20వ వార్డు) సూరా భాస్కర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా తహశీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ ప్రయివేట్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఒంటేరు.మల్లికార్జున, ఆనంద్, అనంత్, ఖదీర్, సాజిద్ తదితరులున్నారు.

రాష్ట్రాభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధం

- మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని సవాల్

ప్రజాశక్తి-కలిగిరి

రాష్ట్రంలో అభివృద్ధిపై చర్చించేందుకు వైసిపి నాయకులు ముందుకు వస్తారా.. వస్తే తాను చర్చకు సిద్ధమని మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకటరామారావు సవాల్ విసిరారు. ఆయన కలిగిరి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచేయడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎవరిది అభివృద్ధి పాలనో.. ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలుసునని, బూటకపు ప్రసంగాలు కాదని, వైసిపి నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎవరి పాలన స్వర్ణయుగమో ఎవరి పాలన రాతి యుగమో తేల్చేద్దామన్నారు. జగన్ సిద్ధం అని సభలు పెట్టి అశుద్ధం మాటలు చెబుతున్నాడన్నారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్క ఛాన్సే జగన్‌కు రాజకీయంగా చివరి ఛాన్స్ అని తెలియజేశారు. రాష్ట్రంలో ఏ మూల చూసినా అభివృద్ధి లేదని, ఏ ఊరుకెళ్లినా వైసిపి పాలనలోని 5యేళ్ల విధ్వంసం కనిపిస్తోందన్నారు. వందల కోట్లు ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో సిద్ధం అని సభలు పెట్టడం దారుణమన్నారు. దేశంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా మారిన జగన్‌కు పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది అని ప్రశ్నించారు. అన్ని వర్గాలను మోసం చేసి జగన్ సామాజిక ద్రోహం చేస్తున్నాడని, బూటకపు మాటలు చెబుతున్న జగన్ రెడ్డికి సామాజిక న్యాయం అనే పదం పలికే అర్హతే లేదన్నారు. చంద్రబాబు పేరు చెబితే దళితులకు ఇచ్చిన సబ్ ప్లాన్ నిధులు, ఇన్నోవా కార్లు, నిరుద్యోగ భృతి, 1.50 లక్షల టీచర్ పోస్టులు, రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, పసుపు కుంకుమ, చంద్రన్న బీమా, అమరావతి, రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు, 10 లక్షల ఉద్యోగాలు, పోలవరం గుర్తుకు వస్తాయని తెలిపారు. జగన్‌రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి శీను, ప్రభుత్వ టెర్రరిజం, క్విడ్ ప్రోకో, ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియా గుర్తుకొస్తాయని తెలిపారు. జగన్ పేరు చెపితే అధిక ధరలు, పన్నులు, ఛార్జీల పెంపు, అప్పులు, బాదుడు, మోసాలు, దొంగ ఓట్లు, హింసా రాజకీయాలు గుర్తుకు వస్తాయన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రివర్స్ చేసి, రైతుల సబ్సిడీలు నిలిపివేసిన జగన్‌కు అసలు రాయలసీమలో సభ పెట్టే అర్హతే లేదన్నారు.

ఆరోగ్య కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి- కోవూరు : జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి ఒకరోజు పర్యటనలో భాగంగా జిల్లాలో పర్యటించారు. సోమవారం ఉదయం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. వైద్యశాలలో సర్జికల్ వార్డు, ఆపరేషన్ థియేటర్, మరుగుదొడ్లు, ఆయుర్వేద వైద్యశాల విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. ఓపిల సంఖ్య, మందులు, వైద్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి

సన్నాహక కార్యక్రమం ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

దివంగత నేత మేకపాటి గౌతమ్‌రెడ్డి రెండవ వర్ధంతి సందర్భంగా 21వ తేదీ బుధవారం ఉదయగిరిలో ఏర్పాటుచేసిన సన్నాహక కార్యక్రమం ఏర్పాట్లను మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి పరిశీలన చేశారు. సోమవారం స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో జరుగు ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ ఆహ్వానితులని ఈ సందర్భంగా సినీ గేయ కళాకారులతో భక్తి గీతాలు ఆలపిస్తారని, మాడుగుల నాగశర్మ ప్రవచనాలు వడ్డీ మహేశ్వరీతో భరతనాట్యం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు బహుమతులు మధ్యాహ్న భోజన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్మృతివనం రూ.7కోట్లతో నిర్మించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఆ రోజే శంకుస్థాపన కూడా చేస్తామని తెలిపారు. వ్యవసాయ కళాశాలను త్వరలో యూనివర్శిటీ అయ్యే అవకాశం ఉందని అది కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి కోఆప్షన్ మెంబర్ షేక్ గాజుల తాజుద్దీన్, కళాశాల డిన్ డాక్టర్ టి వి గోపికృష్ణ, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ అక్కి భాస్కర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రతీ విద్యార్థి సాంకేతిక విద్యను అభ్యసించాలని, భవిష్యత్తు సాంకేతిక విద్యదేనని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన టెక్ ఫెయిర్‌ను ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ విద్యార్థులు సిద్ధం చేసిన పలు నమూనాలను పరిశీలించి విద్యార్థులను వాటి గురించి పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. వాటిని ఏ విధంగా తయారు చేశారు.. తయారు చేసిన మోడల్స్ ఉపయోగాలను క్షుణ్ణంగా తెలుసుకుని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక విద్యతో భవిష్యత్తులో ఎన్నో ఉన్నత ఉద్యోగావకాశాలు పొందవచ్చని, విద్యార్థులు ఆ రంగం వైపు దృష్టి సారించాలని సూచించారు. వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు ఈ టెక్ ఫెయిర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సాంకేతిక విద్యపై పూర్తి అవగాహన కలిగి ఉండి ఆ కోర్సుల వైపు దృష్టి సారించాలన్నారు. కళాశాల అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు ఉన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కళాశాల ప్రిన్సిపల్ బి.నాగేశ్వర రావు, హెచ్‌ఒడి వెంకటరమణారెడ్డి, అధ్యాపక సిబ్బంది. ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, ఐ.వి.రమణా రెడ్డి, కౌన్సిలర్లు శివ కోటారెడ్డి, చెరుకూరు కామాక్షయ్య నాయుడు, సయ్యద్ జమీర్ తదితరులున్నారు.

టెక్‌ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి

బర్డ్ ఫ్లూపై కేంద్రబృందం ఆరా..

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో ఇటీవల కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడం, భోపాల్లోని ప్రయోగశాలలో ఈ వ్యాధి నిర్ధారణ కావడం విధితమే. ఈ మేరకు రెండు రోజులుగా పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికార సిబ్బంది. 10 రెస్పాన్స్ టీమ్లు ఏర్పాటు చేసి ఈ గ్రామంలో ఉన్న కోళ్లను తీసుకుని వెళ్లి గొయ్యిలో ఖననం చేయడం విధితమే. ఈ మేరకు ఈ గ్రామాన్ని ఢిల్లీ జై సెంట్ టీమ్ సభ్యులు డాక్టర్ స్మిల్ సంగల్, డాక్టర్ గునుమిత్ కౌర్, డాక్టర్ శ్రేయస్ శర్మలు నిశితంగా పరిశీలించారు. ముందుగా ఈ గ్రామంలో కోళ్లకు వ్యాధి సోకిన వెంకటేశ్వర్లు ఇంటిని సందర్శించి కోళ్లు ఎక్కడి నుంచి తెచ్చారోఎప్పుడు వైరస్ సోకింది ప్రయోగశాలకు ఎప్పుడు తీసుకెళ్లారనే విష యాలపై ఆరా తీశారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో ఈ వ్యాధి కారణంగా ఎన్ని కోళ్లు మృతిచెందాయి ఎన్నికోళ్లు పశు సంవర్ధక శాఖ ఖననం చేశారు అనే విషయాలపై బృందం సభ్యులు నిశితంగా ఆరా తీశారు. ముఖ్యంగా ఈ వైరస్ సోకిన కోళ్లను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు. ఎప్పుడి తీసుకుని వచ్చారు. అనేక విషయా లను కూడా వెంకటేశ్వర్లును ప్రశ్నించి తెలుసు కున్నారు. అదేవిధంగా ఈ బర్డ్ ఫ్లూ వ్యాధి ఈ గ్రామంలోనే ఉందా.. చుట్టుపక్కల గ్రామాల కు కూడా వ్యాపించిందా అనే విషయాలపై కూడా ఈ బృందం సభ్యులు నిశిత పరిశీలన చేపట్టారు. వైరస్ సోకిన తర్వాత పశు సంవర్ధక శాఖ ఏయే చర్యలు చేపట్టింది అనే విషయాలను కూడా సంబంధిత పశు సంవర్ధక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో జిల్లా సర్వేలైన్స్ అధికారి డాక్టర్ భాస్కర్, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగమణి. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మురళి, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ ప్రీతి. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వివరాలు సేకరిస్తున్న కేంద్రబృందం

కావ్య కృష్ణారెడ్డి పరిచయ కార్యక్రమం

ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని బృందావనం హౌసింగ్ కాలనీ కళ్యాణ మండపంలో కావలి నియోజకవర్గ టిడిపి మాజీ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు అధ్యక్షతన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డి పరిచయ కార్యక్రమాన్ని, నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్‌లు పాల్గొని కావ్య కృష్ణారెడ్డిని టిడిపి ఇన్‌ఛార్జిగా ప్రజలకు పరిచయం చేశారు. వేలాదిగా టిడిపి కార్యకర్తలు పాల్గొన్న ఈ సభకు నెల్లూరు పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి ఎంఎల్‌సి బి.రాంగోపాల్ రెడ్డి, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, ఉదయగిరి టిడిపి ఇన్‌ఛార్జి బొల్లినేని రామారావు, కందు కూరు టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, తదితరులున్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతా

ప్రజాశక్తి-కావలి : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ ఆధ్వర్యంలో 'సార్డ్స్' స్వచ్ఛంద సేవాసంస్థ వారు కావలి తుమ్మలపెంట రోడ్డులో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన, నియంత్రణలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పాటలు, వీధి నాటకం ద్వారా హెచ్.ఐ.వి./ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయవ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్.ఐ.వి. వ్యాధి సోకిన వెంటనే ఎ.ఆర్.టి. వాడినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. హెచ్.ఐ.వి. వ్యాధి సోకిన వారిపై వివక్షత ఉండరాదన్నారు. వారిపై ప్రేమతో ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో సార్డ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.రూత్ బేనోమి, ఎ.ఎన్.ఎం. నాగమణి, ఫీల్డ్ స్టాఫ్ హేమలత, ప్రశాంతి, శ్రీలక్ష్మి, రవికుమార్, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి-వరికుంటపాడు : అసెంబ్లీ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్నాయని ఈ నేపథ్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని యర్రంరెడ్డిపల్లి, తోటల చెరువుపల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజాసంకల్పయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా తోటలచెరువుపల్లి గ్రామంలో జరిగిన యాత్రలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కులం, మతం, పార్టీలకతీతంగా అవినీతి లేని పాలనను ప్రజలకు అందించారని తెలిపారు. ఈ ఐదేళ్ల పాలనలో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని, పేదల సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ సిఎం జగన్‌మోహన్ రెడ్డి అని తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తిరుపతి నాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆలీ అహ్మద్, సొసైటీ చైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి సిద్ధయ్య, సర్పంచ్ పీర్లపాటి పెద్దమౌలాలి, వైసిపి నాయకులు ముల్లంగి శ్రీనివాసులు, యర్ర ఓబయ్య, శ్రీధర్, చెన్నరాయుడు, నాదెండ్ల.రమేష్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న మేకపాటి

జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కావలి : అనంతపురం జిల్లా సిఎం సిద్ధం సభలో ఫొటోలు తీస్తున్న స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసిపి మూకల విచక్షణా రహితంగా దాడికి నిరసనగా సోమవారం జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక ట్రంక్ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేసి, అక్కడ నుంచి ఆర్.డి.ఒ. కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దాడికి ఖండనగా నినాదాలు చేస్తూ ఆర్.డి.ఒ. కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ కొంతసేపు ధర్నా చేసి ఆర్.డి.ఒ. కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్ట్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు జయప్రతాప్ రెడ్డి, ఒలేటి నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, వేములపాటి జనార్ధన, గొత్తుల శ్రీధర్, గర్రె వెంకటేశ్వర్లు, అబ్దుల్ నవీద్, పి.జె.ఎస్.ప్రసాద్, దార్ల రమేష్, చిమటా కిషోర్, నరసింహ, ఎం.ఎ. అలీం, చరిత్ర కుమార్, ముజీర్, వాలి కుమార్, బి.మనోహర్, కావలి జర్నలిస్టులు పాల్గొన్నారు.

కావలిలో జర్నలిస్టుల నిరసన

జర్నలిస్ట్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం : సిపిఎం

ప్రజాశక్తి-బిట్రగుంట : వైసిపి పార్టీ నిర్వహిస్తున్న సభలో ఫొటో జర్నలిస్ట్‌పై జరిగిన దాడిని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని బోగోలు సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు కార్యదర్శి చల్ల నరహరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి వచ్చి నాలుగున్నర సంవత్సరం కాలంలో ప్రజలపై దాడులు, హత్యలు, దౌర్జన్యాలు పెరిగాయని, ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అని, జర్నలిస్టుల కోసం ప్రత్యేక కఠినమైన చట్టాలను తేవాలని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు.

జర్నలిస్ట్‌పై దాడి హేయమైన చర్య : టిడిపి

ప్రజాశక్తి-బిట్రగుంట : అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న సభలో ఆంధ్రజ్యోతి కెమెరామెన్‌పై జరిగిన దాడి హేయమైన చర్యని బోగోలు మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. జర్నలిస్ట్‌పై జరిగిన దాడికి నిరసనగా సోమవారం బోగోలు అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్‌బాబు, టిడిపి నాయకులు గోసాల శ్యాంసుందర్, జయ, మనోహర్, అమర్, దన్యాసి శ్రీధర్, ఆవుల సురేష్, ఆటో యూనియన్ నాయకులు రమణయ్య, తదితరులున్నారు.

మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 4 / 2021

మందాడి సుశీల - వాది

Vs

షేక్.హసాన్ - ప్రతివాది

To,
(డిఫెండెంట్) **షేక్.హసాన్** తండ్రి **షేక్.ఖాసిం,** ముస్లిం, ఎంప్లాయి, వయస్సు 58 సం॥లు, డోర్ నెం.10-3-15/2ఎ, అంకమ్మతల్లి పెట్రోల్ బంకు వెనుక, కోటారెడ్డి నగర్, కందుకూరు పట్టణం మరియు మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా.

పై ఓ.ఎస్.నెం.లో వాది మిమ్ములను ప్రతివాదిగా చేర్చి దావా దాఖలు చేసియున్నారు. మీ హాజరు నిమిత్తం కోర్టువారు దావా సమను నిమిత్తం **తేది:29-02-2024 న ఉదయం గం॥ 10.30 నిముషములకు** మీరు స్వయంగా గానీ లేదా మీ ప్లీడరు ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల పై కేసు నీ పరోక్షంగా తీర్మానించగలరు.

పై Suit లోని I.A.No.19/2021 లోని పిటిషన్‌లో మీరే రెస్పాండెంట్‌గా (Respondent) ఉన్నారు. కాబట్టి 19-01-2024 న ఇదే పేపరులో ప్రకటన వేసియున్నారు. కాని నీవు కోర్టుకు హాజరుకాలేదు.

వి.సులోచన
వాదితరపు అడ్వకేటు, కందుకూరు

టిడిపిలో వైసిపి నేతలు చేరిక

ప్రజాశక్తి-బిట్రగుంట: టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో బోగోలు మండలం జక్కేపల్లి గూడూరు కమ్మపాలెంకు చెందిన వైసిపి నాయకులు సోమవారం వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి పులివెందుల ఎంఎల్‌సి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, కావలి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ జెపి గూడూరు పంచాయతీకి చెందిన గ్రామ 6వ వార్డు మెంబర్ పల్లిపాటి ఆనందరావు, యాసారపు సుధాకర్, పందిటి వెంకయ్య, పల్లిపాటి రవీంద్ర, పల్లిపాటి దేవదానం, రఘు, రమేష్, మావులూరి చిన తాతయ్య, పులింద్ర సురేష్, తదితరులు టిడిపిలో చేరారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో బోగోలు మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం ప్రారంభం

ప్రజాశక్తి-బిట్రగుంట: శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బొచ్చు అమర ఛారిబుల్ ట్రస్ట్ దాతృత్వంలో బొచ్చు వెంకట కృష్ణయ్య నిర్మించిన అన్నదాన భవనాన్ని సోమవారం ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి భక్తుల కోసం బచ్చు అమరా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకట కృష్ణయ్య సహకారంతో భక్తులకు అన్నదాన సత్రాన్ని నిర్మించినందుకు ఆయనకు అభినంద నలు తెలిపారు. కార్యక్రమంలో బచ్చు కృష్ణ కుమార్ దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, కార్యనిర్వహణ అధికారి రాధాకృష్ణ, జర్నలిస్ట్ వెంకటేశ్వర్లు, బిట్రగుంట ఎస్‌ఐ శేఖర్ బాబు, మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, స్థానిక నాయకులు కర్తం సురేందర్ రెడ్డి, ఆలయ ధర్మకర్త సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతికుటుంబానికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-సంగం: రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే సొంతమని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తలుపూరుపాడు గ్రామంలో సోమవారం విజయీభవయాత్రలో ఆయన మాట్లాడారు. గ్రామాలకు విచ్చేసిన ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్థానిక దేవాలయంతో పాటు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడిన ఎంఎల్‌ఎ మేకపాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల గురించి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రతి కుటుంబానికి జగనన్న సంక్షేమ పథకాలను అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రావుల లక్ష్మి, వైసిపి నాయకులు కరిముల్లా, రఘునాథ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఇంతవరకు గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వలేదో వైసీపీ పెద్దలు సమాధానం చెప్పాలని జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం 13వ డివిజన్ యనమల వారి దిన్నె ప్రాంతంలో అల్ హుదా పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఆయన కలిసి జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో మరోసారి మాయమాటలతో తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందన్నారు. హడావుడిగా టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం సిగ్గుచేటన్నారు. కనీసం తాగేందుకు నీళు కూడా లేని స్థితిలో ఉన్న ఇళ్లను హడావుడిగా లబ్ధిదారులు పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల స్టంట్ కాక అదేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజలు వాస్తవాలు గ్రహించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ వైసీపీ ప్రభుత్వానికి తమ ఓటు-తో కోలుకోలేని విధంగా బుద్ధి చెప్పాలని తెలిపారు. జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, 13వ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఊటుకూరు శ్యామ్, నగర జనసేన నాయకులు అజయ్ బాబు, జీవన్, సుల్తాన్ భాషా, పవన్, బాలాజీ, ఆనంద్, లాలూ, నాగూరు, తెలుగుదేశం నాయకులు తిరుపతయ్య, కాయల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఎన్నికలకు వెళ్లే ముందు ప్రజలే నా స్టార్ క్యాంపెనర్లు అని చెప్పిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. గడపగడపకు ప్రభుత్వ సంక్షేమం అభివద్ధి కార్యక్రమాలను నేరుగా అందించాలన్న ఆలోచన చేసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది ఒక జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగస్వాములైన వాలంటీర్లను ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇళ్ల వద్దకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమ ఆశయసాధన కోసం గౌరవంగా, నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న వాలంటీర్లకు రానున్న రోజుల్లో గొప్ప మేలు జరిగే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచిస్తున్నారని వ్యాఖ్యానించారు. స్థానిక రామ్మూర్తి నగర్‌లోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో సోమవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తాళ్లూరు అవినాష్, షేక్ ఫామీదా, యాకసిరి వాసంతి, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, దాసరి అమత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకత పాలన

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రాష్ట్రంలో వైసీపీకి రోజురోజుకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని ఇప్పటికే మూలన పడిన ఫ్యాన్‌కు.. త్వరలోనే రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని 50వ డివిజన్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీలోని కీలక నేతలందరూ తెలుగు దేశం పార్టీలో చేరుతూ ఉండడంతో.. జగన్ మోహన్ రెడ్డికి మతిభ్రమించి ,తల పొగరుతో తమ పార్టీపై విమర్శలు చేస్తున్నార న్నారు. టిడిపి అధికారంలో కొస్తే జగన్ అడ్రస్సు గల్లంతవుతుందని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ సామాన్యులకు అండగా ఉంటుందని.. తమ ప్రభుత్వ హయాంలో ఒక్క పైసా కూడా కరెంటు, ఆర్‌టిసి ఛార్జీలను

మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

పెంచిన దాఖలాలు లేవన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండేవని.. వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులు బతికే పరిస్థితి లేదన్నారు.. జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సభలకు బీరు, బిర్యానీ డబ్బులుచ్చి జనాలను తరలిస్తున్నారని స్వచ్ఛందంగా వచ్చే వారు కాదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో జగన్మోహన్ రెడ్డి జైలుకు వెళ్తారని.. పార్టీ బంగాళాఖా తంలో కలవడం ఖాయమని జోస్యం చెప్పారు.. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నా యని.. జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కప్పిర శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, బండి ప్రసాద్, చిన్న తదిత రులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల డంపింగ్ పై ఆగ్రహం

-లారీని అడ్డుకొన్న గ్రామస్తులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలను డంపింగ్ చేస్తుండ డంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ చేస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. వి వరాల మేరకు....కోవూరు ప్రాంతం నుంచి కోళ్ల వ్యర్థాలను టి ఎన్ 14 5743 నంబర్ గల ఐ షర్ మినీ లారీలో తీసుకొచ్చి మండలంలోని సౌత్ ఆములూరు గ్రామం వద్ద డంప్ చేస్తున్నారు. గత కొంత కాలం నుంచి రహదారి వెంబడి కొంత మంది చికెన్, చనిపోయి న బాయిలర్, ఫారం కోళ్లు, వాటి వ్యర్థాలను ఈ ప్రాంతం లో పడేస్తున్నారు. దీంతో అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతోం దని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యం లో సోమవారం కోళ్ల వ్యర్థాలను డంపింగ్ చేస్తుండగా ఆగ్ర హించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో కోళ్ల

కోళ్ల వ్యర్థాలు ఉన్న దృశ్యం

వ్యర్థాలను డంపింగ్ చేస్తుండడంతో హెచ్చరించామని తెలిపారు. దాంతో రాత్రి సమయాల్లో గుట్టు చప్పు డు కాకుండా డంపింగ్ చేసి వె ళ్తుండడంతో కాపుకాచి పట్టుకొ న్నామని గ్రామస్తులు తెలిపారు. ఓ వైపు విస్తరిస్తున్న ప్రా ణంతకమైన బర్డ్ ఫ్లూ, మరో వై పు కోళ్ల వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో తాము అనే క ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. దుర్వాసన వెదజల్లుతోందని, జబ్బులు కూడా వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధి కారులు స్పందించి కోళ్ల వ్యర్థాలను రోడ్ల పక్క పోసి ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్న చికె న్ స్టాళ్ల నిర్వాహకులను గుర్తిం చి తగు చర్యలు తీసుకోవాల ని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై జరిగిన దాడిని సర్వేపల్లి నియోజకవర్గం బిఎస్‌సి ఎమ్మెల్యే అభ్యర్థి జానకిప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా జానకి ప్రసాద్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం లో జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి శ్రీ కష్ణ ని విచక్షణారహితంగా కొట్టి ,పత్రికల గొంతు నొక్కాలని వైఎస్సార్సీపి చూస్తోందని విమర్శించారు. వైసీపీ చర్యలను బిఎస్‌పి ఖండిస్తోందని బహుజన సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని ప్రసాద్ తెలిపారు. శ్రీకష్ణను అర కిలోమీటర్ దూరం కొట్టుకుంటూ తీసుకెళ్తున్న పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం చాలా దుర్మార్గం అన్నారు. పత్రికల గొంతు నొక్కి విచక్షణారహితంగా ఎవరి మీద పడితే వారి మీద కేసులు పెట్టి, వైఎస్‌ఆర్సిపి కి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిన, వారిని నిర్బంధించడం దాడులు చేయడం జగన్ ప్రభుత్వంలో సర్వసాధారణమైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడేంకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

నిరంతరం విద్యుత్‌ను అందించాలి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రైతులు సాగుచేసిన పంటలు నిట్ట నిలువునా ఎండిపోతున్నాయని, నిరంతరాయంగా 9 గంటలు పగటిపూట కరెంటు అందించి ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోతారని టిడిపిరాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య టిడిపి నేత ఇందుపూరు శ్రీనివాసరెడ్డిలుపేర్కొన్నారు. కలెక్టరేట్ లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో డి.ఆర్‌ఒను కలసి, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు పగటిపూట 3 ఫేస్ 9 గంటలు విద్యుత్ సరఫరా అందించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా 9 గంటల కరెంటు ఇస్తామని చెప్పి ప్రస్తుతం ఇష్టానుసారంగా సరఫరా చేస్తూ7 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 13నుంచి 15 వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారని, వెన్ను దశకు చేరిందన్నారు. పంటను కాపాడుకోవాలంటే 9 గంటలపాటు నిరంతరాయ విద్యుత్ ను అందించాలన్నారు.

రైతులకు 9 గంటలు కరెంట్, నాలుగు రోజుల్లో ఇవ్వకుంటే నెల్లూరు రూరల్ నియోజకవర్గం రైతుల పక్షాన విద్యుత్ శాఖఎస్.ఇ. కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, టీడీపీ నాయకులు మలినేని వేణు నాయుడు, సాదినేని వెంకటేశ్వర్లు నాయుడు, ఈశ్వరయ్య, రాపూరు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-సీతారామపురం

మండల కేంద్రమైన సీతారామపురంలో వైసిపి జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీ పాలగిరి ముద్దుకృష్ణమరాజు, వేదవతి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైసిపి యువ నాయకుడి వివాహ వేడుకకు ప్రజలు నాయకులు భారీగా వచ్చి వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పి.సి.అల్లూరు రాజు, గండిపాలెం మాజీ ఎంపిటిసి పాముల రమణయ్య, చిన్ననాగంపల్లి సర్పంచ్ మునగల రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ రేనాటి సుధాకర్ నాయుడు, నాయకులు రమణారెడ్డి, మాచిరాజు వెంకటేశ్వర్లు, రేనాటి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-సంగం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సోమవారం డ్వామా పిడి వెంకటరావు జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. మండలంలో ఏప్రిల్ 2022 నుండి మార్చి 2023 వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన 673 పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. పనులకు ఖర్చు చేసిన రూ.4 కోట్ల 16లక్షలకు సంబందించి గ్రామాల వారీగా మస్టర్ రికార్డులు పరిశీలించారు. మండలం మొత్తం 20 గ్రామాలకు గానూ అధికారులు రూ.69 వేల 522 రికవరీ చేశారు. జిల్లాలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. కూలీలకు వేతనాలు పెండింగ్ లేకుండా చెల్లిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పి వెంకయ్య, ఎపిడి శంకర్ నారాయణ, డిఆర్‌పిలు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు